


HAPPY Independence DAY

# క్రైమ్ మిర్రర్ ®

Voice of Anti Corruption

## తెలంగాణ జిల్లాలు

బుధవారం 4-2-2026 పబ్లిషింగ్ సెంటర్ : హైదరాబాద్



# కష్టపడి పని చేస్తే "కాంగ్రెస్ పార్టీ" దే విజయం

- టిక్కెట్ రాని నేతలు అధైర్య పడొద్దు
- పార్టీ పదవులు నామినేటెడ్ పోస్టులలో వారికి ప్రాధాన్యం
- ఐక్యంగా పనిచేస్తే ఐదు మున్సిపాలిటీలు మనవే
- బీఫాంలు అందించిన మెదక్ పార్లమెంట్ ఇంచార్జి నీలం మధు
- పటాన్ చెరు నియోజకవర్గం ఇంచార్జి కాట శ్రీనివాస్ గౌడ్

**పటాన్ చెరు, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి ఫిబ్రవరి 03:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని తెలంగాణ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు కష్టపడి ప్రజల్లోకి తీసుకుని వెళ్తే మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించడం తథ్యమని మెదక్ పార్లమెంట్ ఇన్చార్జి నీలం మధు, పటాన్చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కాట శ్రీనివాస్ గౌడ్ అన్నారు. మంగళవారం ఐదు మున్సిపాలిటీల పరిధిలోని కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేస్తున్న అభ్యర్థులకు బీ ఫాం లను అశోక్ నగర్ లోని కాట నివాసంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో ప్రజల మద్దతు ఉన్న నాయకులనే కౌన్సిలర్ అభ్యర్థులుగా టికెట్లు కేటాయించినట్లు తెలిపారు. టికెట్ల కేటాయింపులు సర్వే ఆధారంగా పూర్తి పారదర్శకంగా నిర్వహించినట్లు వివరించారు. టికెట్లు రాని అభ్యర్థులు అధైర్య పడాల్సిన అవసరం లేదని కాంగ్రెస్ పార్టీ వారికి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. రాబోయే నామినేటెడ్ పదవులతో పాటు పార్టీ పదవులలో టికెట్ రాని నేతలకు పెద్దపీటవేస్తామని హామీ ఇచ్చారు. ఆ నేతలు నిరుత్సాహపడకుండా ఆయా వార్డులలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గెలుపు కోసం ఐక్యంగా కృషి చేయాలని కోరారు. రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారెంటీలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లి కాంగ్రెస్ పార్టీ విజయానికి ప్రతీ కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు.

# కాంగ్రెస్‌కు భారీ బలం

- 20, 21 డివిజన్లలో ఉత్సాహభరిత ప్రచారం
- 200 మందికి పైగా కాంగ్రెస్‌లో చేరిక

**మంచిర్యాల, (క్రైమ్ మిర్రర్):** మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో భాగంగా 20వ డివిజన్‌లో గంగరపు వెంకటేశ్వర్లు, 21వ డివిజన్‌లో జోగుల సదానందం లు ఎన్నికల ప్రచారంలో మంచిర్యాల ఎమ్మెల్యే శ్రీ కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు కాంగ్రెస్ పార్టీ బలపరిచిన కార్పొరేటర్ అభ్యర్థుల చేతి గుర్తుకు ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని ప్రజలను ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మంచిర్యాల జిల్లా మాజీ డీసీసీ అధ్యక్షురాలు శ్రీమతి కొక్కిరాల సురేఖ ప్రేమ్ సాగర్ రావు మాట్లాడుతూ, ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై 20, 21 డివిజన్లకు చెందిన బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల్లో దాదాపు 200 మందికి పైగా కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు తెలిపారు. పార్టీలో చేరిన వారందరికీ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం 20వ డివిజన్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ఆమె ప్రారంభించారు.



# కౌన్సిలర్ అభ్యర్థుల తుది జాబితా విడుదల

- మున్సిపల్ ఎన్నికల బరిలో 59 మంది అభ్యర్థులు...
- మున్సిపల్ కమిషనర్ జి. వెంకట్రామిరెడ్డి
- 17వ వార్డు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి చింతల ఉమామహేశ్వరి ఏకగ్రీవం



4లో

# పని ప్రదేశాలలో మహిళలను లైంగిక వేధింపులకు గురి చేసే వారిపై చట్టపరమైన చర్యలు

**జిల్లా సంక్షేమ అధికారి రౌఫ్ ఖాన్**



**మంచిర్యాల, (క్రైమ్ మిర్రర్):** ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, పని ప్రదేశాలలో మహిళలను లైంగికంగా వేధించే వారిపై పోష్ యాక్ట్ ప్రకారం చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా సంక్షేమ అధికారి రౌఫ్ ఖాన్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. మహిళలు లైంగిక వేధింపుల నిరోధక చట్టం పాస్ - 2013 పై అవగాహన కలిగి ఉండాలని, పని ప్రదేశాలలో మహిళలకు భద్రత, గౌరవం, సమానత్వం కల్పించడమే లక్ష్యంగా చట్టం రూపొందించడం జరిగిందని తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేట్ పరిశ్రమలలో, వాణిజ్య, వ్యాపార సముదాయాలలో, షాపింగ్ మాల్స్, జిన్నింగ్ మిల్లులు, ఇతర పని ప్రదేశాలలో పని చేసే మహిళలు లైంగిక వేధింపులకు గురైతే బాధిత మహిళలు నిర్భయంగా అంతర్గత ఫిర్యాదు కమిటీకి ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. పోష్ చట్టం 2013 ద్వారా న్యాయం పొందవచ్చని తెలిపారు. ఫిర్యాదు పై కమిటీ నిర్ణిత కాలంలో విచారణ పూర్తి చేసి తగు చర్యలు తీసుకుంటుందని, అవసరమైతే పోలీస్ కేసు నమోదు చేయడం జరుగుతుందన్నారు. ప్రతి కార్యాలయంలో, పని ప్రదేశాలలో అంతర్గత కమిటీలు ఏర్పాటు చేయాలని, మహిళలపై లైంగిక వేధింపుల నిరోధానికి అందరం సమిష్టిగా కృషి చేద్దామని తెలిపారు. మహిళలపై లైంగిక వేధింపుల నివారణ చట్టాన్ని సమర్థ వంతంగా అమలు చేసేందుకు జిల్లా మహిళా సాధికారత కేంద్రం ద్వారా విస్తృతస్థాయి లో చర్యలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. పోష్ చట్టం, అంతర్గత ఫిర్యాదు కమిటీ ఉద్దేశం, హక్కులు, ఫిర్యాదు విధానం, కమిటీ నిర్మాణం, బాధ్యతలు వంటి అంశాలపై అధికారులు, ఉద్యోగులకు స్పష్టమైన అవగాహన కల్పించడం జరుగుతుందని, కమిటీ వివరాలను నిర్దిష్ట ఫారం ద్వారా సేకరించి సంబంధిత సమాచారాన్ని షీ బాక్స్ పోర్టల్ లో నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలోని వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలలో ఇప్పటి వరకు 47 అంతర్గత ఫిర్యాదు కమిటీలు ఏర్పాటు చేయడం జరిగిందని, వీటిలో ప్రభుత్వ జిల్లా స్థాయి కార్యాలయాల లో 30 కమిటీలు, ఉప జిల్లాస్థాయి కార్యాలయాలలో 16, ప్రైవేట్ సంస్థలు, షాపింగ్ మాల్స్, దుకాణాలలో ఒక కమిటీ పనిచేస్తున్నాయని తెలిపారు. ప్రైవేట్ సంస్థలు తమ సంస్థలలో కమిటీలను ఏర్పాటు చేయాలని, జిల్లా సంక్షేమ శాఖ కార్యాలయం, షీ బాక్స్ పోర్టల్ లో నమోదు చేసుకోవాలని తెలిపారు. పోష్ చట్టం అమలుతో మహిళలకు పని ప్రదేశాలు సురక్షితంగా మారుతాయని, ప్రతి మహిళ తన హక్కులను తెలుసుకొని ధైర్యంగా ముందుకు రావాలని తెలిపారు.

# మేయర్ అభ్యర్థి ప్రకటన పై మూడు పార్టీలు మౌనం?

**మంచిర్యాల, (క్రైమ్ మిర్రర్):**

బీజేపీ పార్టీ మాత్రం కాంగ్రెస్,బిఆర్ఎస్ రెండూ ప్రజల విశ్వసనీయత కోల్పోయాయని లెక్కలు వేసుకుంటోంది.ఆ ఖాళీని తామే భర్తీ చేస్తామని,నిశ్శబ్ద వ్యూహంతో గెలుపు దిశగా పయనిస్తున్నామని నేతలు గుసగుసలు వినిపిస్తున్నాయి.కానీ ఈ వ్యూహం క్షేత్రస్థాయిలో ఎంత ప్రభావం చూపుతుందన్నది ఇంకా స్పష్టతకు రాలేదు.కొత్త వారికి అవకాశాలు పాతవారికి అసంతృప్తి కార్పొరేషన్ ఎన్నికలు కొత్త అభ్యర్థులకు అవకాశాల పండుగగా మారాయి. ముఖ్యంగా అధికార పార్టీలో ఇతర పార్టీల నుంచి చేరిన వారికి టికెట్లలో ప్రాధాన్యం పెరగడంతో,పార్టీలోని సీనియర్ కార్యకర్తలు అసంతృప్తితో ఉన్నారు.ఇది భవిష్యత్తులో పార్టీలో చీలికలకు దారి తీసే ప్రమాదం ఉందన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి.

**ఇండిపెండెంట్ అభ్యర్థులు ఓట్లు చీల్చే వ్యూహమా**

టికెట్ దక్కని కొందరు నేతలు "ప్రజాసేవే లక్ష్యం" అంటూ ఇండిపెండెంట్లుగా బరిలోకి దిగడం రాజకీయంగా చర్చనీయాంశమైంది.మరోవైపు,ప్రధాన పార్టీలకు చెందిన కొందరు నాయకులే ఇండిపెండెంట్ అభ్యర్థిగా నిలబడి ఓట్లు చీల్చేందుకు ప్రయత్నిస్తున్నారని ప్రజల్లో గుసగుసలు




వినిపిస్తున్నాయి.ఇది ప్రజాస్వామ్య నైతికతపై ప్రశ్నలు లేవనెత్తుతోంది. చివరికి తీర్పు ఎవరిది?ఈ రాజకీయ గందరగోళంలో అధికార పార్టీ నిర్ణయాలు ప్రతిపక్షాలకు ఊతమిచ్చినట్టే కనిపిస్తున్నాయి.అంతర్గత అసంతృప్తులు, వ్యూహాత్మక మౌనం,ఇండిపెండెంట్ ప్రయోగాల మధ్య చివరికి లాభపడేది ఎవరు అన్నది ప్రశ్నగా మిగులుతోంది. అయితే ఒక విషయం మాత్రం స్పష్టం.మంచిర్యాల ప్రజలు ఈసారి పార్టీ గుర్తు కంటే పనితనం,హామీల కంటే నమ్మకం,రాజకీయాల కంటే ప్రజాసేవను చూస్తారా?లేక మళ్లీ రాజకీయ లెక్కలకే ఓటేస్తారా?ఆ సమాధానం ఎన్నికల ఫలితాల వరకూ వేచి చూడాల్సిందే.

## ఎఫ్ డీ పీ టి ని అడ్డుకున్న ఇందిరమ్మ లబ్ధిదారుల

**జన్నారం(క్రైమ్ మిర్రర్):** ప్రభుత్వం తమకు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తే ఇసుక రాకుండా అటవీ అధికారులు అడ్డుకుంటున్నారని నిరసిస్తూ మంగళవారం ఇంజన్ పెల్లికి వచ్చిన ఎఫ్ డి పి టి శాంతారామ్ ను మురిమడుగు కొమురం భీమ్ చౌరస్తా వద్ద ఇందిరమ్మ లబ్ధిదారులు అడ్డుకున్నారు. ఇసుక లేకుండా ఇల్ల నిర్మాణం ఎలా చేస్తామని ఎఫ్డిపిటిపై ప్రశ్నల వర్షం కురిపించారు. ఇసుకపై తమకు కచ్చితమైన హామీని ఇవ్వాలని పట్టుపట్టారు. రేంజ్ కార్యాలయంలో అందరితో మాట్లాడతానని హామీ ఇచ్చిన ఎఫ్ డి పి టి కార్యాలయంకు రాకుండా వెళ్లిపోయారు.





## ఎన్నికల్లో మైక్ పర్మిషన్ దరఖాస్తుల వెల్లువ

**మంచిర్యాల, (క్రైమ్ మిర్రర్):** మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ కు ఫిబ్రవరి 11న జరగనున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని మైక్ పర్మిషన్ దరఖాస్తుల వెల్లువ కొనసాగుతోంది.ఎన్నికల్లో పోటీ చేస్తున్న పలు రాజకీయ పార్టీల అభ్యర్థులు తమ తమ డివిజన్లలో ఆటో రిక్షాల ద్వారా మైక్ ప్రచారం నిర్వహించేందుకు అనుమతులు కోరుతూ గత మూడు రోజులుగా కార్పొరేషన్ కార్యాలయంలో దరఖాస్తులు సమర్పి స్తున్నారు. మైక్ పర్మిషన్ పొందాలంటే అభ్యర్థులు నిర్దేశిత దరఖాస్తు ఫారం తో పాటు వెహికల్ ఆర్సీ కార్డు,ఫిట్‌నెస్ సర్టిఫికెట్,వాహన బీమా పత్రాలు,ఏసీపీ సంతకంతో ధృవీకరించిన దరఖాస్తు సమర్పించాల్సి ఉంటుంది. అదేవిధంగా రోజుకు రూ.100 చొప్పున రామగుండం పోలీస్ కమిషనర్ పేరిట బ్యాంక్ చలానా చెల్లించాల్సి ఉంటుందని అధికారులు తెలిపారు.ఫిబ్రవరి 2వ తేదీ వరకు అందిన దరఖాస్తులను పరిశీలించిన అనంతరం మంచిర్యాల కార్పొరేషన్ కమిషనర్ ఇప్పటివరకు 50 మైక్ పర్మిషన్ లెటర్లు జారీ చేసినట్లు వెల్లడించారు.మైక్ సెట్ పర్మిషన్‌కు సంబంధించిన దరఖాస్తుదారులకు 24 గంటల్లోనే అనుమతి పత్రాలు అందజేస్తున్నామని కార్పొరేషన్ అధికారులు తెలిపారు. ఎన్నికల నిబంధనలు, నియమావళిని కచ్చితంగా పాటిస్తూ అభ్యర్థులు మైక్ పర్మిషన్ కోసం దరఖాస్తులు చేసుకోవాలని అధికారులు సూచించారు.

## శిష్యునికి గురువు ఘన సన్మానం

**మంచిర్యాల, (క్రైమ్ మిర్రర్):** మంచిర్యాల జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయు నిగా పదోన్నతి పై వచ్చిన 1992 బ్యాచ్ పదవ తరగతి పూర్వ విద్యార్థి బండి రమేష్ ను విద్య బుద్ధులు నేర్పించిన గురువర్యులు , తెలంగాణ రాష్ట్ర పర్యావరణ చట్టం అథారిటీ రాష్ట్ర సభ్యులు, రాష్ట్రపతి అవార్డు గ్రహీత, గుండేటి యోగేశ్వర్ పాఠశాలలో ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులతో కలిసి మంగళవారం ఘనంగా సన్మానం చేసి, పచ్చని మొక్కను అందించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా బండి రమేష్ తమ గురువు శుభాశీస్సుల ను స్వీకరించారు. ఎంతో చరిత్ర గల ఈ పాఠశాల విద్యార్థులను ఉన్నత లక్ష్యంతో అన్ని రంగాల్లో ప్రతిభ చాటేలా, ఉత్తమ ఫలితాల సాధన ధ్యేయంగా విజయవంతంగా నిర్వహించాలని, పేద విద్యార్థులు చదువుకునే ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేయాలని,పాఠశాల అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



# న్యాయం: ప్రజాస్వామ్య రక్షణ కవచమా? పాలకుల ప్రతీకార ఆయుధమా?

**హైదరాబాద్, ఫిబ్రవరి 03(క్రైమ్ మిర్రర్):** నేడు భారత ప్రజాస్వామ్యంలో సామాన్యుడిని వేధిస్తున్న అతిపెద్ద ప్రశ్న: "న్యాయం నిష్పక్షపాతంగా ఉందా? లేక రాజకీయ అధికార మార్పిడికి అనుగుణంగా రంగులు మార్చుకుంటుందా?"ప్రస్తుత పరిణామాలు గమనిస్తే, చట్టం తన పని తాను చేసుకుపోవడం కంటే.. అధికారం ఉన్నప్పుడు ఒకలా, కోల్పోయాక మరోలా వ్యవహరిస్తోందన్న భావన ప్రజల్లో బలపడుతోంది. రాజ్యాంగబద్ధమైన వ్యవస్థల కంటే రాజకీయ ప్రయోజనాలే శక్తివంతమైనవనే ఈ సందేహం, ప్రజాస్వామ్య మూలాలకే సవాలుగా మారుతోంది..




**నిన్నటి పాలకులు.. నేడు నిందితులు!**

నిన్నటి వరకు అధికార పీఠంపై ఉండి వ్యవస్థలను శాసించిన వారు, అధికారం మారగానే దర్యాప్తు సంస్థల ముందు నిందితులుగా నిలబడటం ఇప్పుడు నిత్యకృత్యమైపోయింది. ఇది నిజంగానే అవినీతిపై జరుగుతున్న పోరాటం అయితే ప్రతి ఒక్కరూ స్వాగతించాల్సిందే. కానీ, ఈ చర్యలు కేవలం 'రాజకీయ ప్రతీకారం' కోసమే జరుగుతున్నాయన్న సందేహం సామాన్యుల్లో కలుగుతోంది. దర్యాప్తు సంస్థలు నిష్పక్షపాతంగా వ్యవహరించకుండా, పాలకుల చేతిలో రాజకీయ సాధనాలుగా మారితే అది వ్యవస్థల మనుగడకే ప్రమాదకరం.

**రాజకీయ చదరంగంలో 'పావులు'గా దర్యాప్తు సంస్థలు**

కేంద్రంలోనైనా, రాష్ట్రంలోనైనా అధికారం మారగానే పాత ఫైళ్లకు ఉన్నట్టుండి దుమ్ము దులపడం ఒక ఆనవాయితీగా మారింది. అధికారంలో ఉన్నప్పుడు: ఏ అక్రమాలు కనిపించవు. ప్రతి వ్యవహారం 'క్లీన్' గా ఉన్నట్లు భ్రమ కలిగిస్తారు. అధికారం కోల్పోగానే: అవే వ్యవహారాలు అకస్మాత్తుగా 'కేసులు'గా మారుతాయి. విచారణల పరంపర మొదలవుతుంది. ఇది యాదృచ్ఛికం కాదు; దర్యాప్తు సంస్థల స్వయంప్రతిపత్తిపై పాలకుల అపరిమిత పట్టుకు నిదర్శనం. అధికారుల బదిలీలు, పోస్టింగ్స్ అన్నీ రాజకీయ నాయకుల కనుసన్నల్లోనే సాగుతుండటంతో, ఈ సంస్థలు తమ స్వతంత్రతను కోల్పోయి 'ప్రతీకార వేదికలు'గా మారుతున్నాయన్న విమర్శలు వెలువడుతున్నాయి.

**రాజకీయ 'శుద్ధి': పార్టీ మారితే పాపాలు పటాపంచలేనా?**

ప్రస్తుత రాజకీయాల్లో 'అవకాశవాదం' పతాక స్థాయికి చేరుకుంది. నిన్నటి వరకు అవినీతి ఆరోపణలతో దర్యాప్తు సంస్థల చుట్టూ తిరిగిన నేత, నేడు అధికార పక్షంలో చేరగానే అకస్మాత్తుగా నిజాయతీ గల మనిషిగా' మారిపోవడం ప్రజాస్వామ్యాన్ని పరిహాసం చేస్తోంది. ద్వంద్వ న్యాయం : ఒకే నేరం చేసినా.. అధికార పక్షంలో ఉంటే 'రక్షణ', ప్రతిపక్షంలో ఉంటే 'శిక్ష' అన్నట్లుగా పరిస్థితులు మారుతున్నాయి. ఇది చట్టం ముందు అందరూ సమానులే అనే రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం. విశ్వసనీయత ప్రశ్నార్థకం : నేతలు పార్టీ మారగానే విచారణలు మందగించడం చూస్తుంటే, దర్యాప్తు సంస్థలు కేవలం 'రాజకీయ లొంగుబాటు' కోసం వాడుకోబడుతున్నాయా? అన్న అనుమానం కలగక మానదు.

**మీడియా ట్రయల్స్: విచారణకు ముందే శిక్షలు !**

నేడు టీవీ స్టూడియోలే న్యాయస్థానాలుగా మారుతున్నాయి. విచారణ పూర్తికాకముందే ఒక వ్యక్తిని నేరస్థుడిగా ముద్ర వేసే 'మీడియా ట్రయల్స్' ఆందోళన కలిగిస్తున్నాయి. దీనివల్ల వ్యక్తిత్వ హననం జరుగుతోంది. భవిష్యత్తులో కోర్టు నిర్దోషిగా తేల్చినా, అప్పటికే ఆ వ్యక్తి సామాజికంగా కోలుకోలేని నష్టాన్ని చవిచూస్తున్నారు.

**వ్యవస్థల విముక్తి: పునరుద్ధరణకు మార్గాలు**

వ్యవస్థల గౌరవాన్ని కాపాడి, ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసేందుకు కొన్ని సంస్కరణలు తక్షణావసరం: దర్యాప్తు సంస్థల స్వయంప్రతిపత్తి : ఇవి కార్యనిర్వాహక వ్యవస్థ చేతిలో కీలుబొమ్మలుగా మారకుండా, కేవలం రాజ్యాంగానికి మాత్రమే జవాబుదారీగా ఉండేలా చట్టబద్ధమైన స్వయంప్రతిపత్తిని కల్పించాలి. ప్రత్యేక కోర్టులు – సత్వర విచారణ: రాజకీయ నేతల కేసుల కోసం ప్రత్యేక ఫాస్ట్ ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేసి, నిర్ణీత కాలపరిమితిలో విచారణ పూర్తి చేయాలి. న్యాయప్రక్రియ నేరస్థులకు రక్షణ కవచం కాకూడదు. నియామకాల్లో పారదర్శకత : కీలక సంస్థల అధిపతుల ఎంపికలో ప్రభుత్వం ఏకపక్షంగా వ్యవహరించకుండా.. అధికార, ప్రతిపక్షాలతో పాటు న్యాయవ్యవస్థకు భాగస్వామ్యం కల్పించాలి. అధికారం మారిన ప్రతిసారీ న్యాయం తన దారి మార్చుకుంటే, అది ప్రజాస్వామ్య పతనానికి నాంది అవుతుంది. న్యాయం ఎప్పుడూ పాలకుల వైపు కాదు, ధర్మం వైపు నిలబడాలి. వ్యవస్థలు వ్యక్తుల ఇష్టాయిష్టాలకు అతీతంగా పనిచేసినప్పుడే రాజ్యాంగ ఆశయాలు నెరవేరుతాయి. జి. అజయ్ కుమార్



# చత్రపతి విగ్రహావిష్కరణకి 50 వేల రూపాయల విరాళం అందజేసిన ఏజేఆర్

**క్రైమ్ మిర్రర్ వలిగొండ:** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల పరిధిలోని వెల్వర్తి చత్రపతి శివాజీ యూత్ అసోసియేషన్ కమిటీ సభ్యులు ఏజేఆర్ ఫౌండేషన్ అధినేత ఎలిమినేటి జంగారెడ్డిని మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన వెల్వర్తి గ్రామంలో నెలకొల్పనున్న చత్రపతి శివాజీ విగ్రహానికి 50,000 వేల రూపాయలు విరాళం అందజేశారు. ఈ సందర్భంగా వెల్వర్తి శివాజీ యువజన సంఘం సభ్యులు ఎలిమినేటి జంగారెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టీఆర్ఎస్ యువజన సంఘం మండల అధ్యక్షుడు పల్లం రాజు గౌడ్,యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# మద్యం మత్తులో ఓ వ్యక్తి ఉరేసుకొని ఆత్మహత్య



**కూకట్ పల్లి, ఫిబ్రవరి 03 (క్రైమ్ మిర్రర్) :** తాగిన మత్తులో ఇంట్లో ఎవరు లేని సమయంలో ఓ వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన కూకట్ పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మూసా పేట లో నివాసం ఉండే మహ్మద్ అమీనులిస్ లాం (38) భార్య, ముగ్గురు పిల్లలతో నివాసం ఉంటూ కూలీ పని చేసుకుంటూ జీవిస్తున్నాడు. తాగుతూ భార్య తో గొడవ పడుతూ ఉండేవాడు. సోమవారం రాత్రి తాగి వచ్చి భార్యతో గొడవ పడటంతో ఆమె పుట్టింటికి వెళ్లింది. ఉదయం పిల్లలు స్కూల్ కి వెళ్లేందుకు ఇంటికి వచ్చి చూడగా ఉరేసుకుని చనిపోయి కనిపించాడు. పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

# సూరారం విశ్వకర్మ కాలనీలో సీఎంఆర్ హాస్పిటల్ ఉచితవైద్య శిబిరం

**కుత్బుల్లాపూర్, ఫిబ్రవరి 03 (క్రైమ్ మిర్రర్) :** కుత్బుల్లాపూర్ నియోజక వర్గం, సూరారం విశ్వకర్మ కాలనీ లో సీఎంఆర్ హాస్పిటల్ సౌజన్యంతో గోపాల్ రెడ్డి ఆధ్వర్యంలో ఇంచార్జ్ దుర్గ ప్రసాద్ రెడ్డి అధ్యక్షతన మెడికల్ క్యాంప్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విశ్వకర్మ కాలనీ అధ్యక్షులు బిఆర్ఎస్ సీనియర్ నాయకులు కె.శ్రీనివాస్ రెడ్డి, దొడ్ల శ్రీనివాస్, కే. నర్సింహా, కాలనీ అధ్యక్షులు ఎస్. జీవన్ రెడ్డి, విశ్వకర్మ సంఘం అధ్యక్షులు కృష్ణమాచారి, మల్లేష్, మస్తుదన్ రెడ్డి, 'వెంకట్, రాములు, కిరణ్, మురళి, జిలాని గోపాల్ రెడ్డి, సందీప్, లత, రమ,పాల్గొన్నారు. వృద్ధులు మహిళలు కాలనీవాసులు పెద్ద ఎత్తున పాల్గొని వారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. విశ్వకర్మ కాలనీలో చాలామంది నిరుపేదలు మధ్యతరగతి కుటుంబాలు ఎన్నో ఉన్నాయి. ఇలాంటి మంచి కార్యక్రమాలు ప్రతినెల నిర్వహించాలని శ్రీనివాస్ రెడ్డి, జీవన్ రెడ్డి కోరారు.




# కౌన్సిలర్ అభ్యర్థుల తుది జాబితా విడుదల

- మున్సిపల్ ఎన్నికల బరిలో 59 మంది అభ్యర్థులు...
- మున్సిపల్ కమిషనర్ జి. వెంకట్రామిరెడ్డి
- 17వ వార్డు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి చింతల ఉమామహేశ్వరి ఏకగ్రీవం

**చౌటుప్పల్.ఫిబ్రవరి 03. క్రైమ్ మిర్రర్ :** యాదాద్రి భువనగిరి జిల్లా,చౌటుప్పల్ రెండవ మున్సిపల్ సాధారణ ఎన్నికలు- 2026 ఎన్నికల లో భాగంగా మున్సిపల్ పోరులో నిలిచిన 59 మంది అభ్యర్థుల తుది జాబితాను మంగళవారం సహాయ జిల్లా ఎన్నికల అధికారి,మున్సిపల్ కమిషనర్ జి వెంకట్రాంరెడ్డి విడుదల చేశారు. చౌటుప్పల్ మున్సిపాలిటీలో మొత్తం 20 వార్డులు ఉండగా అందులో 17 వ వార్డు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి చింతల ఉమామహేశ్వరి ఏకగ్రీవం కావడం జరిగిందని తెలిపారు. చౌటుప్పల్ పురపాలక సంఘం పరిధిలో జరగనున్న రెండవ మున్సిపల్ సాధారణ ఎన్నికలు-2026 కు సంబంధించి నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ మంగళవారం ముగియటంతో,ఈ మేరకు పోటీలో నిలిచిన అభ్యర్థుల తుది జాబితాను ఎన్నికల అధికారులు అధికారికంగా విడుదల చేశారు. మొత్తం 20 వార్డులకు గాను వివిధ రాజకీయ పార్టీల అభ్యర్థులు, స్వతంత్ర అభ్యర్థులు బరిలో ఉన్నారు. -వార్డుల వారీగా పోటీలో ఉన్న అభ్యర్థుల వివరాలు: 1వ వార్డులో కొసనం రాకేష్ రెడ్డి ,తూర్పునూరి మల్లేష్ గౌడలు, 2వ వార్డులో పోలేపల్లి లక్ష్మి , సురవి మంజుల, వల్లందాసు స్వాతి, బత్తుల రాజ్యలక్ష్మి లు 3వ వార్డులో లావణ్య పల్లె, కొయ్యలగూడెం సోనీ , దీపిక రమణ గోని లు, 4వ వార్డులో గ్యార సుధాకర్ , లింగయ్య ముత్తయ్య దాసరి , ఇప్ప వెంకటేష్ , ఊదరి యాదయ్య లు, 5వ వార్డులో తోకల సాయికుమార్ , పెద్దగారి విగ్నేష్ కుమార్ , మొగులయ్య గట్టు, కొయ్యడ శేఖర్, ధర్మేందర్ గౌడ్ కొండూరు లు, 6వ వార్డులో రావుల లక్ష్మి అలియాస్ బాసాని లక్ష్మి, బడేటి మమత, ఆలే శ్రీలత, రావుల వసంత లు, 7వ వార్డులో కాసర్ల మంజుల , కానుగు యాదమ్మ ,గుండు స్వరూప లు, 8వ వార్డులో బద్రి గాలయ్య , చుక్క యాదయ్య , ఎర్ర భుజంగం లు, 9వ వార్డులో మోగుదాల పావని ,గుర్రం సంతోష్ కుమార్ ,దండా అరుణ్ కుమార్ లు, 10వ వార్డులో మనసం సంగీత ,గోశిక సుమతి, దేప రమ్య లు, 11వ వార్డులో గోశిక వినయ్ కుమార్ , పోలోజు శ్రీధర్లు, 12వ వార్డు లో గుండాల శివకుమార్, పాక చిరంజీవి, తాడూరు




పరమేష్ లు, 13వ వార్డులో గుండెబోయిన పూజిత, బత్తుల వాణి, చెవిగొని స్వాతి శివకుమార్ లు, 14వ వార్డులో ఉడుగు జ్యోతి , మార్గం పూజ, చింతల విజయలక్ష్మి లు 15వ వార్డులో అంతటి విజయలక్ష్మి , గడ్డం ఇందిరా లు, 16వ వార్డులో బత్తుల జయమ్మ ,సంధ్యా వెన్ రెడ్డి లు, 17వ వార్డులో చింతల ఉమామహేశ్వరి, 18వ వార్డులో బుడ్డా సురేష్ , గుగులోతు అరుణ , సుల్తాన్ సురేందర్ కుమార్, 19వ వార్డు లో బత్తుల శ్రీశైలం , పిల్లలమర్రి మధుసూదన్ , రమణగొని శంకరయ్యలు, 20వ వార్డులో గోశిక పురుషోత్తం, మహమ్మద్ అతార్ పాషా, హన్ను మహమ్మద్ లు వారి వారి పార్టీల నుండి పోటీ చేస్తున్నట్లు తెలిపారు. మంగళవారం పోటీలో ఉన్న అభ్యర్థుల తుది జాబితా విడుదల కావడంతో చౌటుప్పల్ మున్సిపాలిటీలో ఎన్నికల ప్రచారం ఊపందుకుంది. ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని అధికారులు కోరారు.

## ఘనంగా శ్రీ సంత్ రవిదాస్ మహారాజ్ జయంతి వేడుకలు



**కూకట్ పల్లి, ఫిబ్రవరి 03 (క్రైమ్ మిర్రర్) :** కూకట్ పల్లి నియోజకవర్గం, మూసాపేట్ డివిజన్ మోచి బస్తీలో శ్రీ సంత్ రవిదాస్ మహారాజ్ 649 వ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు ముఖ్య అతిథిలుగా కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, మూసాపేట్ మాజీ కార్పోరేటర్ తూము శ్రావణ్ కుమార్ హాజరై ప్రత్యేక పూజా ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పోరేటర్ పగడాల బాబు రావు, జిల్లా గోపాల్, ప్రభాకర్ గౌడ్, గరిగె తుకారాం, ఇనుగంటి రాజు, జైరాజ్, అరుణ్ ,కృష్ణ, వినోద్, నరేష్, సంజయ్, సంఘం ప్రతినిధులు కొండిబ, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్యకు వైద్యానికి అధిక ప్రాధాన్యత

- టిపిసిసి ఉపాధ్యక్షుడు, కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి బండి రమేష్

**కూకట్ పల్లి, ఫిబ్రవరి 03 (క్రైమ్ మిర్రర్) :** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యకు, వైద్యానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందని ఈ రంగాల్లో నిధుల కేటాయింపుకు లోటు లేదని టిపిసిసి ఉపాధ్యక్షుడు, కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి బండి రమేష్ పేర్కొన్నారు. ఆయన మంగళవారం స్థానిక నాయకులతో కలిసి కూకట్ పల్లి లోని జూనియర్ డిగ్రీ కళాశాలను సందర్శించారు. ప్రిన్సిపాల్ వెంకటయ్యను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన కాలేజీలో నెలకొన్న సమస్యలను రమేష్ దృష్టికి తీసుకువచ్చారు. కళాశాలలో మొత్తం 3,400 మంది విద్యార్థులు చదువుతున్నారని వీరికి భవనాల కొరత తీవ్రంగా ఉందన్నారు. ఎప్పుడో 20 ఏళ్ల నాడు నిర్మించిన పాత భవనాలే తప్ప మళ్ళీ కొత్త భవనాలు నిర్మించలేదని దీంతో విద్యార్థులను అకామిడేట్ చేయడం ఇబ్బందికరంగా తయారైంది అన్నారు. వెంటనే స్టూడెంట్స్ అందరికీ సరిపోయిన రీతిలో కొత్త భవనాలను నిర్మించాల్సి ఉందన్నారు. దీనిపై రమేష్ సానుకూలంగా స్పందించారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి, ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళ్లి నిధులు ఏర్పాటయ్యేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాగిరెడ్డి, తాము వేణు, సతీష్ రెడ్డి, ప్రతాప్ రెడ్డి, గొట్టిముక్కల వెంకటేశ్వరరావు, గంధం రాజు, కృష్ణరాజు పుత్, మైకేల్, వినోద్, రంగమోహన్, ఫణి కుమార్, అరవింద్, గోపాల్ చౌదరి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.



## ఎల్లమ్మబండ ప్రధాన రహదారిలో ట్రాఫిక్ కష్టాలను నియంత్రించేందుకు కృషి

**రోడ్డు విస్తరణ పనులను పరిశీలించిన కార్పొరేటర్ వెంకటేష్ గౌడ్**

**కూకట్ పల్లి, ఫిబ్రవరి 03 (క్రైమ్ మిర్రర్) :** ఉషాముళ్ళపూడి కమాన్ నుండి గాజులరామరం వరకు వయా ఎల్లమ్మబండ ప్రధాన రహదారి 100 ఫీట్ రోడ్డు విస్తరణ పనులను ఆల్విన్ కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ జిహెచ్ఎంసి అధికారులతో కలిసి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ మాట్లాడుతూ ఎల్లమ్మబండ ప్రధాన రహదారిలో నిత్యం ట్రాఫిక్ సమస్య తో ప్రజలు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారని అన్నారు. ట్రాఫిక్ సమస్య పరిష్కారానికై 100 ఫీట్ రోడ్డు విస్తరణ చేపట్టడం జరుగుతుందని, విస్తరణ పనులు వేగంగా చేసి ఎల్లమ్మబండ ప్రజలకు ట్రాఫిక్ సమస్యలు తొలగిస్తామని అన్నారు. అదేవిధంగా వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి రోడ్డు మధ్యలో అడ్డంకిగా ఉన్న ఎలక్ట్రికల్ స్థంబాలను త్వరితగతిన స్థాన భ్రంశం చేయాలని, రోడ్డు డివైడర్ మధ్యలో



సుందరికరణ పనులు చేపట్టాలని, మౌలిక వసతుల కల్పనలో అలసత్వం ప్రదర్శించకుండా రోడ్డు విస్తరణ పనులు త్వరితగతిన చేపట్టి ప్రజలకు అందుబాటులో కి తీసుకురావాలని సంబంధిత అధికారులకు సూచించారు. కార్యక్రమంలో సమ్మారెడ్డి, గోపాల్, పోశెట్టిగౌడ్, సుధాకర్, ఎ.ఇ యుగంధర్ రెడ్డి, యుబిడి నాగరాణి, వర్క్ ఇన్స్పెక్టర్ రవి కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## కూకట్ పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో అప్పుల బాధతో ఓ వ్యక్తి ఆత్మహత్య



**కూకట్ పల్లి, ఫిబ్రవరి 03 (క్రైమ్ మిర్రర్) :** అప్పుల బాధతో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన కూకట్ పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఆల్విన్ కాలనీ డివిజన్,ఇంద్ర హిల్స్ శంషిగూడలో స్నేహితుతో పాటు కలిసి నివాసముంటున్న జితేందర్ యాదవ్ (26) ప్రైవేట్ ఉద్యోగం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల తన సోదరి వివాహం జరగడంతో అప్పులు అయ్యాయి. వాటిని తీర్చలేక మరికొంత అప్పులు చేయవలసి వచ్చింది. దీంతో అప్పుల బాధతో మనస్తాపం చెంది ఫ్యాన్ కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



## వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న మాజీ శాసనసభ్యులు కూన శ్రీశైలం గౌడ్

**కుత్బుల్లాపూర్, ఫిబ్రవరి 03 (క్రైమ్ మిర్రర్) :** కుత్బుల్లాపూర్ లో వెలసిన 168 సంవత్సరాల చరిత్ర కలిగిన వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామివారి సేవలో కాంగ్రెస్ పార్టీ నాయకుడు, మాజీ శాసనసభ్యులు కూన శ్రీశైలం గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై వేణుగోపాలస్వామి వారికి ప్రత్యేక పూజలు చేసి స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం ఆలయ కమిటీ వారు శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అతి పురాతన చరిత్ర కలిగిన శ్రీ వేణుగోపాల స్వామి వారి ఆశీస్సులు తీసుకోవడం చాలా సంతోషంగా ఉందని, నియోజకవర్గ ప్రజలు సుఖ సంతోషాలతో, ఆయు ఆరోగ్యాలతో సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ & ధర్మకర్త ఠాకూర్ రాజేందర్ సింగ్, శ్రీరాములు గౌడ్, నల్ల లింగం గౌడ్, మనోహర్, లక్ష్మణ్, పులి బలరాం, నర్సింగ్ (ఏటీఎం) స్థానిక డివిజన్ నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

## బాచుపల్లి స్మశాన వాటిక తొలగింపు అంశంపై మంత్రి శ్రీధర్ బాబు కి వినతి

**కుత్బుల్లాపూర్, ఫిబ్రవరి 03 (క్రైమ్ మిర్రర్) :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, బాచుపల్లి ప్రాంతంలో గత 50 సంవత్సరాలుగా కొనసాగుతున్న స్మశాన వాటికను తొలగించాలనే ప్రతిపాదనపై స్థానిక ప్రజల్లో ఆందోళన నెలకొంది. ఇటీవల ఏర్పడిన కొత్త కాలనీ నివాసులు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నప్పటికీ, స్మశాన వాటికను తొలగిస్తే సుమారు 50 వేల మంది ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని గ్రామస్థులు తెలిపారు. అదేవిధంగా ఎంపీపీ, మున్సిపల్ కార్పొరేషన్ కాలంలో ఈ స్మశాన వాటిక అభివృద్ధి కోసం నిధులు కూడా కేటాయించారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి మంగళవారం ఐటి & పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ని కలిసి సమస్యపై వినతి పత్రం సమర్పించారు. స్మశాన వాటిక అనేక సంవత్సరాలుగా ప్రజలకు ఉపయోగపడుతోందని, ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని దానిని కొనసాగించేలా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై స్పందించిన మంత్రి శ్రీధర్ బాబు సంబంధిత అధికారులతో సమగ్రంగా పరిశీలించి, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు, స్థానిక గ్రామ ప్రజలు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.



# డ్రగ్స్,గంజాయి మాఫియా పై కఠిన చర్యలు తీసుకోవాలి

- ఎక్సైజ్ కానిస్టేబుల్ సౌమ్య హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలి
- డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఆనగంటి వెంకటేష్




**చౌటుప్పల్. ఫిబ్రవరి 03. క్రైమ్ మిర్రర్:** నిజామాబాద్ జిల్లా మోపాల్ గ్రామానికి చెందిన ఎక్సైజ్ మహిళా కానిస్టేబుల్ సౌమ్యను డ్రగ్స్,గంజాయి మాఫియా అతి దారుణంగా కారుతో యాక్సిడెంట్ చేసి హత్య చేయడాన్ని ఖండిస్తున్నామని, హత్య చేసిన గంజాయి స్మగ్లర్లను కఠినంగా శిక్షించాలని డివైఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆనగంటి వెంకటేశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం సాయంత్రం భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య ఆధ్వర్యంలో చౌటుప్పల్ బస్టాండ్ చౌరస్తాలో గంజాయి స్మగ్లర్ల చేతిలో హత్య గావింపబడిన ఎక్సైజ్ కానిస్టేబుల్ సౌమ్యకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆనగంటి వెంకటేష్ మాట్లాడుతూ... జనవరి 23న గంజాయి సరఫరా చేస్తున్నారన్న సమాచారం మేరకు నిజామాబాద్ శివారులోని మాధవ నగర్ వద్ద ఎక్సైజ్ పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలో ఎక్సైజ్ పోలీసులను చూసిన గంజాయి స్మగ్లింగ్ ముఠా సభ్యులు పారిపోయేందుకు ప్రయత్నించగా దీంతో ఎక్సైజ్ కానిస్టేబుల్ సౌమ్య వారిని పట్టుకునే ప్రయత్నంలో గంజాయి ముఠా సభ్యులు తమ కారుతో ఎక్సైజ్ కానిస్టేబుల్ సౌమ్యను ఢీకొట్టడంతో ఆమె తీవ్రంగా గాయపడ్డారని ఎనిమిది రోజులపాటు సౌమ్య ఆసుపత్రిలో మృత్యువుతో పోరాడి విధి నిర్వహణలో అసాధారణ తెగువ ప్రదర్శించి అసువులు బాసిన ఎక్సైజ్ కానిస్టేబుల్ సౌమ్య కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా కుటుంబాన్ని ఆదుకోవాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. పోలీసులకే రక్షణ లేనప్పుడు సామాన్య ప్రజల పరిస్థితి ఏంటని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని అధికారులను ప్రశ్నించారు. రాష్ట్రంలో డ్రగ్స్ లేకుండా చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెబుతున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో పరిస్థితి భిన్నంగా ఉందన్నారు. ప్రతి జిల్లాలో మాదకద్రవ్యాల సరఫరా విచ్చలవిడిగా సాగుతోందన్నారు. ప్రభుత్వం వీటిని అరికట్టడంలో విఫలమవుతోందన్నారు. కానిస్టేబుల్ సౌమ్య హత్య కేసులో నిందితులకు కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలన్నారు. కేవలం అరెస్టులకే పరిమితం కాకుండా, డ్రగ్స్ నెట్‌వర్క్‌ను పూర్తిగా కూకటి వేళ్లతో సహా పెకిలించాలన్నారు. ఈ ఘాతుకానికి పాల్పడిన నిందితులను శిక్షించేందుకు తక్షణమే ఫాస్ట్ ట్రాక్ కోర్టును ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు పల్లె మధు కృష్ణ, జిల్లా ఉపాధ్యక్షుడు ఎండి ఖయ్యూం, ప్రజా సంఘాల నాయకులు ఎండి పాషా బండారు నరసింహ బత్తుల శంకర్ డివైఎఫ్ఐ నాయకులు ఎండి కాశీం రొడ్డ భగత్ సింగ్, తూర్పునూరు మల్లేష్ శంకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి, అవినీతి రహిత పాలన కోసం సిపిఎం అభ్యర్థులను గెలిపించండి

- కాలుష్యం, మంచినీళ్లు, కార్మికుల సమస్యలను పరిష్కరిస్తాం
- సుత్తి కొడవలి చుక్క గుర్తుకే ఓటేయండి
- సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కె.రాజయ్య విజ్ఞప్తి



**పటాన్ చెరు, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి ఫిబ్రవరి 03:** మంగళవారం జిన్నారం మున్సిపల్ పరిధిలోని జంగంపేట మూడో వార్డు కౌన్సిలర్ అభ్యర్థి గా పోటీ చేస్తున్న కమ్మరి గోవర్ధన్ కి మద్దతుగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కె.రాజయ్య ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజయ్య మాట్లాడారు. అభివృద్ధి కోసం, అవినీతి రహిత పాలన కోసం, ప్రజా పోరాటాల కోసం, జిన్నారం మున్సిపల్ పరిధిలో తీవ్రంగా కాలుష్య సమస్య పరిష్కారం కోసం సిపిఎం పార్టీ అభ్యర్థి ని గెలిపించాలని రాజయ్య కోరారు. కాలుష్య సమస్య పరిష్కారం కోసం, మంచినీళ్లు, కార్మికుల సమస్యలు, ఇళ్లస్థలాల సమస్యలు పరిష్కరిస్తామని ఆయన అన్నారు. సిపిఎం అభ్యర్థులను గెలిపించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. సుత్తి కొడవలి చుక్క గుర్తుకు భారీ మెజార్టీ ఇవ్వాలని రాజయ్య కోరారు. సిపిఎం అభ్యర్థులు గెలవడం ద్వారానే స్థానిక సంస్థల్లో ఆదర్శవంతమైన పాలన, అవినీతి లేని పాలన సాధ్యమవుతుందని ఆయన అన్నారు. అలాగే స్థానిక సమస్యల పరిష్కారం కోసం నిత్యం అందుబాటులో ఉండే వ్యక్తులు సిపిఎం అభ్యర్థులని ఆయన అన్నారు. సిపిఎం అభ్యర్థులు నిజాయితీగా ప్రజలకు సేవ చేస్తారని, నిత్యం అందుబాటులో ఉంటారని ఆయన అన్నారు. వార్డులలో మున్సిపల్ లో రోడ్లు, మంచినీళ్లు, ఇండ్లు ఇళ్ల స్థలాలు, పింఛన్లు తదితర సమస్యల పరిష్కారం కోసం సిపిఎం అభ్యర్థులను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. సిపిఎం గెలిపించడం ద్వారానే అభివృద్ధి సాధ్యమవుతుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం అభ్యర్థి కమ్మరి గోవర్ధని, నాయకులు రవీందర్, కమ్మరి కృష్ణ, కమ్మరి బ్రహ్మచారి, గొల్ల కృష్ణ, తుమ్మల బాల నర్సింలు, రామేష్ రెడ్డి, కుక్కల నవీన్, ముత్యాలు, శ్రీనివాస్ గౌడ్, జయ రాజు యాదగిరి, బాదిని శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# అలగడప పీహెచ్‌సీ ఆకస్మిక తనిఖీ

- మెరుగైన వైద్య సేవలు అందించాలి : డీఎంహెచ్వో పుట్ల శ్రీనివాస్

**క్రైమ్ మిర్రర్ మిర్యాలగూడ, ఫిబ్రవరి 4:** ప్రజలకు నిత్యం వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండి మెరుగైన వైద్య సేవలు అందించాలంటూ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి (డీఎంహెచ్వో) పుట్ల శ్రీనివాస్ అన్నారు. మంగళవారం ఆయన అలగడప ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీలోని పలు రికార్డులను పరిశీలించిన ఆయన, వైద్య సేవల నిర్వహణపై సిబ్బందికి అవసరమైన సూచనలు, మార్గదర్శకాలు అందించారు. ముఖ్యంగా రోగులకు ఇబ్బందులు కలగకుండా సమయపాలనతో సేవలు అందించాలని, ప్రభుత్వ వైద్య సేవలపై ప్రజలకు నమ్మకం కలిగేలా పనిచేయాలని సూచించారు. ఈ తనిఖీ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్వో డా. దీపా, అలగడప వైద్యాధికారి డా. షేక్ మోయిూద్, ఎన్‌హెచ్‌ఎం డీపీఓ విష్ణు, సిహెచ్‌ఓ మోతిలాల్, ప్రభాకర్, వాసుదేవ రెడ్డి, సత్యనారాయణ రెడ్డి తదితర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.





# ఆర్థిక సహాయం అందజేత

**క్రైమ్ మిర్రర్ వలిగొండ:** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల పరిధిలోని పహిల్వాన్ పూర్ గ్రామానికి బొడ్డుపల్లి యాదయ్య హార్ట్ స్ట్రోక్ తో మరణించారు అనే విషయం తెలిసిన వెంటనే,వారి యొక్క కుటుంబ సభ్యులకి ఏ జే ఆర్ ఫౌండేషన్ అధినేత ఎలిమినేటి జంగారెడ్డి సహకారంతో 5,000 వేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు గ్రామ యువత,తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ శాఖ ప్రజా బాట



**నూతనకల్ ( క్రైమ్ మిర్రర్):** విద్యుత్ సమస్యల పరిష్కారానికి విద్యుత్ శాఖ ప్రజా బాట నిర్వహించటం అభినందనీయమని పెదనెమిల గ్రామ సర్పంచ్ సురకంటి లావణ్య-మధుసూదన్ రెడ్డి అన్నారు.మంగళవారం పెదనెమిల నిర్వహించిన ప్రజాబాట కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా విద్యుత్ సిబ్బంది గ్రామంలో శిధిలా వ్యవస్థలో ఉన్న స్తంభాలను, విద్యుత్ వైర్లు లూస్ కనెక్షన్ ఉన్నటువంటి వాటిని పరిశీలించారు. స్మశాన వాటికలో 11/33 కనెక్షన్ కొరకు ఏఈ ప్రణయ్ కుమార్ ను కోరగా సానుకూలంగా స్పందించి నూతన స్తంభాల ఏర్పాటు లూజ్ కనెక్షన్లను సరి చేస్తామని చెప్పారు.ఈ యొక్క కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ వల్లమల్ల నరేష్, వార్డు సభ్యులు కనకం చక్కని, చిప్పలపల్లి రాంబాబు, పురం శ్రావణ్ కుమార్, చింతమల్ల నగేష్, మొలుగూరి సంధ్యారాణి, గుర్రం అనసూయ, బొల్కసుమతి, బొల్క చంద్రయ్య గ్రామ హెల్పర్ బొల్క మల్లయ్య గ్రామస్తులు పాల్గొన్నారు.

# జిట్టా నగేష్ కు బి ఫామ్ అందజేత

**చిట్యాల క్రైమ్ మిర్రర్:** చిట్యాల మున్సిపల్ పరిధిలోని (1 వ వార్డు) శివనేనిగూడెం లో కౌన్సిలర్ గా పోటీ చేస్తున్న కాంగ్రెస్ బలపర్చిన సిపిఎం అభ్యర్థి జిట్ట నగేష్ మంగళవారం నాడు బి ఫాం అందజేశారు.ఈ సందర్భంగా నగేష్ ను నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం శివనేనిగూడెంలో ఇంటి ఇంటి ప్రచారం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గోంద్ర మహేందర్ రెడ్డి, దేవనక పెద్దయ్య, మల్లెబోయిన మల్లేశం, రుద్రవరం మల్లేష్, నూతి సైదులు, గాదె గీత సిపిఎం మండల నాయకులు బొబ్బిలి సుధాకర్ రెడ్డి, ఐతరాజు నర్సింహా,చొప్పరి మల్లేశం, పాలమాకుల అర్జున్,జిట్ట సరోజ, మేడి సుగుణమ్మ తదితరులు పాల్గొన్నారు.



# కౌన్ బనేగా 6వ వార్డు కౌన్సిలర్

- ఓటరు తీర్పు ఎటువైపు
- మూడోసారయినా గెలిచేనా... ?

**క్రైమ్ మిర్రర్, నేరేడుచర్ల :** నేరేడుచర్ల మున్సిపల్ పరిధిలో జరుగుతున్న మున్సిపల్ ఎన్నికల్లో చైర్మన్ పదవి జనరల్ రావడంతో ఉన్న 15 స్థానాల్లో కేవలం మూడు స్థానాలు మాత్రమే జనరల్ స్థానాలు రాగా అందులో ఆరవ వార్డు కౌన్సిలర్ జనరల్ అవడం తో కాంగ్రెస్ పార్టీ నుంచి చైర్మన్ ఆశావాహుడు పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నూకల సందీప్ రెడ్డి పోటీ చేస్తుండగా అదే వార్డులో గతంలో గ్రామ పంచాయతీకి ఉన్న సమయంలో వార్డు సభ్యుడుగా, మొదటి మున్సిపల్ ఎన్నికల్లో కౌన్సిలర్ గా , పోటీ చేసి ఓటమి చెందిన బిఆర్ఎస్ నాయకుడు చిత్తలూరి సైదులు మరోసారి అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు ముచ్చటగా మూడోసారి ఆరవ వార్డుపై కాంగ్రెస్ ముఖ్య నాయకుని పై తెలపడనున్నారు. బిఆర్ఎస్ లో చైర్మన్ ఆశావాహు అభ్యర్థులతోపాటు , జనరల్ స్థానంపై పోటీ చేసేందుకు అనేకమంది బిఆర్ఎస్ నేతలు పోటీపడాలని ముందుకు వచ్చినా నా సీటు నాకే కావాలి అని పోటీకి వచ్చి మరి ముచ్చటగా మూడోసారి బరులోకి దిగుతున్నాడు.ఆరవ కౌన్సిల్ అభ్యర్థిగా అధికార పార్టీ సందీప్ రెడ్డి మంత్రి ఉత్తంకుమార్ రెడ్డికి శిష్యుడుగా పేరు ఉన్న నేపథ్యంలో ప్రస్తుతం అధికార పార్టీ కాంగ్రెస్ ఉండడం ప్రజల అవసరాలు తీర్చేందుకు అభివృద్ధి నిధులతో పాటు, వ్యక్తిగత సహకారాన్ని అందించేందుకు, మంచి అవకాశం ఉన్న నేపథ్యంలో ప్రతి హామీని నెరవేరుస్తానని సందీప్ రెడ్డి ఎన్నికల ప్రచారంలో దూసుకుపోతుండగా సానుభూతి పనిచేస్తుందని గతంలో ఓడిపోయానని ఈసారి గెలిపిస్తే అభివృద్ధి చేస్తానని చెబుతున్న బిఆర్ఎస్ అభ్యర్థి సైదులు పై పూర్తిస్థాయి నమ్మకంలో ఓటర్లు లేరని అధికార పార్టీ వైపే వారి అవసరాల రీత్యా అభివృద్ధి దృష్ట్యా నాకే ఓటు వేస్తారన్న ధీమాలో సందీప్ రెడ్డి ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.ముచ్చటగా మూడోసారి పోటీ చేసే అధికారంలో లేని బిఆర్ఎస్ నేతను గెలిపిస్తారో , లేక అధికార పార్టీ మంత్రి ఉత్తమ్ అండదండలు ఉన్న కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపిస్తారో వేచి చూడాలి మరి.

# వర్తక సంఘం జేఏసీ ఆధ్వర్యంలో మండల అధికారులకు వినతి పత్రాలు అందజేత



**క్రైమ్ మిర్రర్ వలిగొండ:** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల వర్తక సంఘం ఆధ్వర్యంలో వర్తక సంఘ జేఏసీ ఆధ్వర్యంలో వర్తక సంఘం నాయకులు మంగళవారం స్థానిక తహసిల్దార్ జి దశరథ, మండల అభివృద్ధి పరిషత్ అధికారి జలంధర్ రెడ్డి,సబ్ ఇన్స్పెక్టర్ యుగంధర్ గౌడ్,సర్పంచ్ కుంభం వెంకటపాపిరెడ్డిలకు వేరువేరుగా వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వర్తక సంఘ మండల అధ్యక్షుడు బెలిదే శ్రీనివాస్ మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలుగా వ్యాపారాన్ని నమ్ముకుని జీవనం సాగిస్తున్న మాకు ఇతర రాష్ట్రాలకు చెందిన వారు లాభార్జనే ధ్యేయంగా నాసిరకం వస్తువులను తీసుకువచ్చి వ్యాపార సముదాయాలకు అధిక అద్దెలు చెల్లించడంవల్ల స్థానికులకు వ్యాపారం చేయడానికి అద్దె భవనాలు లేక అప్పుల పాలవుతున్నారని, కావున ఇతర రాష్ట్రాల వారిని కట్టడి చేసి స్థానిక వ్యాపారులకు చేయూత నివ్వాలని స్థానికులను కోరుతున్నామని, ఇతర రాష్ట్రాల వారు స్థానికంగా వ్యాపారం చేయకుండా అధికారులు కట్టడి చేయాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్వర్ణకార సంఘం జిల్లా అధ్యక్షుడు బాలాచారి, బీసీ సంఘంమండల అధ్యక్షుడు సాయిని యాదగిరి,గంజి వెంకటేశం, గజ్జల అమరేందర్, లెనిన్, నామాల జగన్, గంజి ఉపేందర్, అప్పిశెట్టి సంతోష్, బడుగు లింగస్వామి, వర్తక సంఘం నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీ పార్టీ అభ్యర్థులకు బీఫాం అందజేత



**చిట్యాల క్రైమ్ మిర్రర్:** చిట్యాల మున్సిపాలిటీలో బీజేపీ పార్టీ అభ్యర్థులకు పార్టీ బీఫాంలను అందజేసిన భువనవగిరి పార్లమెంట్ కన్వీనర్ చిట్యాల మునిసిపల్ ఎన్నికల ఇంచార్జి బందరపు లింగస్వామి నియోజకవర్గం చిట్యాల మునిసిపల్ అధ్యక్షులు గుండాల నరేష్ గౌడ్ నియోజకవర్గం ఇంచార్జి నకిరేకంటి మొగులయ్య జిల్లా ప్రధాన కార్యదర్శి మండలం వెంకన్న ఒకటో వార్డు అభ్యర్థిగా రుద్రవరం లింగస్వామి , రెండవ వార్డు అభ్యర్థిగా గుండాల పవిత్ర మూడో వార్డు అభ్యర్థిగా పాల శ్రీలత నాలుగో వార్డు అభ్యర్థిగా ఉండ్రాతి నాగరాజు, ఐదో వార్డు అభ్యర్థిగా ఈడుదల నర్సమ్మ ఆరో వార్డు అభ్యర్థిగా గంజి గోవర్ధన్, ఏడో వార్డు పాల లక్ష్మమ్మ ఎనిమిదో వార్డు అభ్యర్థిగా మాస శ్రీనివాస్ తొమ్మిదో వార్డు అభ్యర్థిగా కూరెళ్ల శ్రీనివాస్ , పదకొండో వార్డు అభ్యర్థిగా దుడ్డు భాగ్యమ్మ మరియు సుంచు అశ్విని అభ్యర్థిత్వాన్ని ఖరారు చేస్తూ వారికి బీఫాంలను ఆయన అందజేశారు... ఈ కార్యక్రమం లో బీజేపీ రాష్ట్ర నాయకులు జిల్లా పట్టణ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

# బాపునగర్  ఈద్గా ను సందర్శించిన కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ ..

**శేరిలింగంపల్లి క్రైమ్ మిర్రర్ :** శేరిలింగంపల్లి డివిజన్ లోగల బాపునగర్ లోని ముస్లిం మైనారిటీలకు సంబంధించిన ఈద్గాను ముస్లిం మత పెద్దల ఆహ్వానం మేరకు పాల్గొని పరిశీలించిన శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. ఈద్గా ఒకేసారి వేల సంఖ్యలో ప్రజలను ఏకం చేస్తుందని ఇది కుల, మత, ఆర్థిక వ్యత్యాసాలు లేకుండా అందరూ భుజం భుజం కలిపి ప్రార్థించేలా చేస్తూ.. సామాజిక సమానత్వాన్ని చాటే ఒక పవిత్రమైన ప్రదేశమని పేర్కొన్నారు. ఈద్గా ను కాపాడుకునే భాద్యత మనందరిపై ఉందని ఎవరు అపోహాలకు గురవద్దని ఏ చిన్న సమస్య ఉన్న తన దృష్టికి తీసుకురావాలని ఎమ్మెల్యే  సహకారంతో సమస్య పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అందులో భాగంగా తాను కార్పొరేటర్ గా గెలిచిన వెంటనే ముస్లిం సోదరుల కొరకు ఈద్గా ఆవరణలో స్టోన్ ఫ్లోరింగ్ వేయించానని, అది ప్రస్తుతం శిథిలావస్థలో ఉన్నందున సీసీ ఫ్లోరింగ్ వేయిస్తానని హామీ ఇచ్చారు. రంజాన్ పండుగను పురస్కరించుకుని ఈద్గాను, కబురుస్తాన్ లలో పరిశుభ్రత పాటించాలని పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించాలని సంబంధిత జిహెచ్ఎంసి అధికారులతో



మాట్లాడి ప్రత్యేక చొరవ తీసుకొని శుభ్రం చేసే కార్యక్రమం చేపట్టామని పేర్కొన్నారు. మౌలిక సదుపాయాలైన సీసీ రోడ్డు, స్ట్రీట్ లైట్స్, వాటర్ సప్లై తదితరాలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించానని, సాధ్యమైనంత త్వరగా పనులను ప్రారంభించి పూర్తి చేయిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జాకీర్, ఇక్బాల్, రాజ్ కుమార్, ఆజాం, గఫర్, జావేద్, ఖాదర్ ఖాన్, అశోక్, షేబాజ్ యాబా, టిల్లు, తాహెర్, దస్తగిర్, అలీం, అజాజ్, షకీల్, రియాజ్, ముక్రం, షాకీర్, గౌస్, ఖలీం, మహేష్ చారీ, ముంతాజ్ బేగం స్థానిక ముస్లిం సోదరులు తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇంటి నిర్మాణంలో అవకతవకలు?

- పాత ఇల్లును కొత్త ఇల్లుగా నోమోదు
- బేస్మెంట్, రూఫ్ లెవల్ కాకుండానే బిల్లులు?

**క్రైమ్ మిర్రర్, మహాదేవపూర్ ప్రతినిధి:** తెలంగాణలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో అవకతవకలు, అవినీతి ఆరోపణలు, మరియు పాత నిర్మాణాలను కొత్తగా చూపిస్తూ నిధులు పొందే యత్నాలు వెలుగులోకి వస్తున్నాయి. జయశంకర్ జిల్లా మహాదేవపూర్ మండల కేంద్రంలో ఇప్పటికే ఉన్న పాత ఇండ్లను, అసంపూర్తిగా ఉన్న నిర్మాణాలను ఇందిరమ్మ పథకం కింద కొత్తగా నిర్మించినట్లుగా చూపిస్తూ నిధులు కాజేస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. నిర్మాణం సగం కూడా పూర్తి కాకముందే, బేస్మెంట్ లేదా రూఫ్ లెవెల్ పూర్తయిందని తప్పుడు బిల్లులు కూడా పొందుతున్నట్లు బహిరంగ సమాచారం. నిజమైన పేదలను పక్కనపెట్టి, రాజకీయ అనుకూలత, పలుకుబడి ఉన్నవారికి ఇండ్లు మంజూరు కావడం ప్రభుత్వ అధికారుల నిర్లక్ష్యం అనే చెప్పుకోవచ్చు. నిబంధనలను ఉల్లంఘించిన వారిపై, బోగస్



బిల్లులు అప్‌లోడ్ చేసిన వారిపై కఠిన చర్యలు మండల వాసులు కోరుతున్నారు. ఈ పథకం నిజమైన పేదలకు చేరాలంటే, పర్యవేక్షణ పెంచి, అవినీతికి పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

# బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థుల బీఫాంలను అందజేసిన

- మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

**చిట్యాల క్రైమ్ మిర్రర్:** నకిరేకల్ నియోజకవర్గం చిట్యాల మున్సిపాలిటీలో బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థులకు పార్టీ బీఫాంలను అందజేసిన నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే, 



నియోజకవర్గ పార్టీ ఇంచార్జి చిరుమర్తి లింగయ్య ఒకవట వార్డు అభ్యర్థిగా రుద్రవరం యాదయ్య, రెండవ వార్డు అభ్యర్థిగా షేక్ షబానా అజీమ్, మూడో వార్డు అభ్యర్థిగా శేపూరి జయమ్మ రవీందర్, నాలుగో వార్డు అభ్యర్థిగా నలావత్ కృష్ణ నాయక్, ఐదో వార్డు అభ్యర్థిగా చిర్రబోయిన దయ్యాల సమత శ్రీకాంత్, ఆరో వార్డు అభ్యర్థిగా జడల సంతోషి ఆదిమల్లయ్య, ఏడో వార్డు అభ్యర్థిగా కూరెళ్ల జ్యోతి లింగస్వామి, ఎనిమిదో వార్డు అభ్యర్థిగా కందాటి రమేష్ రెడ్డి, తొమ్మిదో వార్డు అభ్యర్థిగా ఆగు అశోక్ యాదవ్, పదో వార్డు అభ్యర్థిగా నిమ్మనగోటి శ్రీనివాసులు, పదకొండో వార్డు అభ్యర్థిగా మారగోని తేజస్విని మరియు పన్నెండో వార్డు అభ్యర్థిగా మెండే సుజాత సైదులు  అభ్యర్థిత్వాన్ని ఖరారు చేస్తూ వారికి బీఫాంలను ఆయన అందజేశారు ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు

# డివిజన్ స్థాయి క్రీడలకు ఆక్స్ఫర్డ్ విద్యార్థులు

- అభినందించిన ఎమ్మెల్యే వీరేశం

**చిట్యాల క్రైమ్ మిర్రర్:** సీఎం కప్ లో భాగంగా సోమవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన డివిజన్ స్థాయి క్రీడల ఎంపికలో ఆక్స్ఫర్డ్ స్కూలుకు చెందిన విద్యార్థులు కబడ్డీ, వాలీబాల్ క్రీడల్లో పాల్గొని చక్కని క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించి డివిజన్ స్థాయికి ఎంపికయ్యారు. బాలికల విభాగంలో పాఠశాలకు చెందిన సుమయ్య, పి సాక్షర, హాసిని, పి అక్షర, సిహెచ్ అక్షర, జోహా, ఝాన్సీ లు డివిజన్ కు ఎంపిక కాగా వాలీబాల్ క్రీడలో రేహాన్, ఆసిఫ్ లు  ఎంపికయ్యారు. మంగళవారం స్కూల్ ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో డివిజన్ స్థాయికి ఎంపికైన విద్యార్థులను, నకిరేకల్ నియోజక వర్గం శాసన సభ్యులు వేముల వీరేశం, ప్రిన్సిపల్ పెద్ది నరేందర్ లు మరియు ఉపాధ్యాయులు అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పిఈటి లింగస్వామి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.





# శ్రీ మల్లికార్జున స్వామి జాతరలో పాల్గొన్న బిఆర్ఎస్ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

**కుత్బుల్లాపూర్, ఫిబ్రవరి 03 (క్రైమ్ మిర్రర్) :** దుండిగల్ మున్సిపల్ సర్కిల్ బౌరంపేట పరిధిలో గల శ్రీశ్రీ మల్లికార్జున స్వామి ఆలయంలో నిర్వహించిన జాతర ఉత్సవాల్లో బిఆర్ఎస్ఎల్పీ విప్, ఎమ్మెల్యే కె.పీ.వివేకానంద్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, స్వామివారి ఆశీస్సులు పొందారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ "ఇలాంటి సంప్రదాయ జాతరలు మన సంస్కృతి, ఆచారాలను కాపాడటంలో కీలక పాత్ర పోషిస్తున్నాయని ఆయన పేర్కొన్నారు" అనంతరం మల్లన్న జాతర విజయవంతంగా జరగడం పట్ల నిర్వాహకులను ఎమ్మెల్యే అభినందించారు. ఈ కార్యక్రమంలో పాక్స్ చైర్మన్ మిద్దెల బాల్ రెడ్డి, మాజీ కౌన్సిలర్లు నర్సారెడ్డి శ్రీనివాస్ రెడ్డి, పల్పనూరి విష్ణువర్ధన్ రెడ్డి, నాచారం మురళి యాదవ్, బి.ఆర్.ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ఎస్.వి. సురేందర్ రెడ్డి, దర్శన్ రెడ్డి, ధర్మారెడ్డి, ఆకుల యాదయ్య, ఆలయ కమిటీ అధ్యక్షులు పద్మారెడ్డి ఉపాధ్యక్షులు నాచారం సురేష్ యాదవ్, చింతా మల్లేష్, గ్రామ పెద్దలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఆటల పోటీలను ప్రారంభించిన --- చిట్యాల సర్పంచ్ ఫోరం అధ్యక్షులు కాటం వెంకటేశం

**చిట్యాల క్రైమ్ మిర్రర్:** చిట్యాల మండలం పెద్దకాపర్తి గ్రామం జడ్పీహెచ్ హై స్కూల్ లో మండల స్థాయి సీఎం ఆటల పోటీలను ప్రారంభించిన చిట్యాల సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు కాటం వెంకటేశం ఈ కార్యక్రమం ఉద్దేశించి మాట్లాడుతూ యువత విద్యార్థులు పెడదారి పట్టకుండా మత్తు పదార్థాలకు బానిసలు కాకుండా ఆరోగ్య ఉల్లాసం కోసం క్రీడలతో దోహద పడతాయి అలాగే క్రీడల్లో నైపుణ్యత పెరిగితే మండల జిల్లా రాష్ట్ర స్థాయిలో స్థానాలు దొరికే అవకాశం ఉంది యువత ఏ గొడవలు లేకుండా క్రీడలో పాల్గొని మండలశీ పేరును మొదటి స్థానంలో నిలబెట్టాలని పెట్టవలసిందిగా కోరుతున్నాను. ఈ కార్యక్రమంలో హై స్కూల్ హెడ్ మాస్టర్ పంచాయతీ కార్యదర్శి గౌతమ్ రెడ్డి ఉప సర్పంచ్ ఓర్సు సైదులు వార్డ్ మెంబర్లు కురు యాదయ్య నీలకంఠ లింగస్వామి సాగర్ల నాగరాజు పిటి  వివిధ గ్రామాల  పిటిసార్లు యువత విద్యార్థులు పాల్గొన్నారు



# చైన్ స్నాచింగ్ కేసులో నిందితుడి అరెస్టు.....

**చందానగర్ క్రైమ్ మిర్రర్ :** వృద్ధ మహిళలను లక్ష్యంగా చేసుకుని పట్టపగలు గొలుసు దొంగతనాలకు పాల్పడుతున్న నిందితుడిని చందానగర్ పోలీసులు, సైబరాబాద్ ఎస్ఓటీ, సీసీఎస్ బృందాలతో కలిసి అరెస్ట్ చేశామని చందానగర్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన పత్రికా సమావేశంలో శేరిలింగంపల్లి ఏసీపీ సిహెచ్ వై. శ్రీనివాస్ కుమార్ తెలిపారు. చందానగర్ పోలీసులకు రెండు చైన్ స్నాచింగ్లకు సంబంధించి రెండు వేర్వేరు ఫిర్యాదులు అందాయన్నారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ఈ నెల 31వ తేదీ మధ్యాహ్నం బీహెచ్ఈఎల్ ఓల్డ్ ఎంఐజీ కాలనీ పరిధిలోని రామాలయం టెంపుల్ రోడ్డులో నడుచుకుంటూ వెళ్తున్న 72 ఏళ్ల వృద్ధ మహిళ మెడలోని బంగారు గొలుసును తెంచుకుని నిందితుడు పరారయ్యాడన్నారు. అదే సమయంలో సమీపంలోనే మరో 73 ఏళ్ల వృద్ధ మహిళను అడ్డగించి ఆమె మెడలోని బంగారు గొలుసును లాక్కొని అక్కడి నుంచి పారిపోయాడు. సాంకేతిక ఆధారాల సాయంతో నిందితుడు రంగారెడ్డి జిల్లా లింగంపల్లి గోపినగర్‌కు చెందిన డి. రాజేష్ (32)గా గుర్తించామని తెలిపారు. నిందితుడిని అదుపులోకి



తీసుకుని, చోరీకి గురైన బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. శేరిలింగంపల్లి జోన్ డీసీపీ సీహెచ్. శ్రీనివాస్, ఐపిసఎస్., ఎస్ఓటీ డీసీపీ శోభన్ కుమార్, క్రైమ్స్ డీసీపీ ముత్యం రెడ్డి పర్యవేక్షణలో శేరిలింగంపల్లి జోన్ అడిషనల్ డీసీపీ ఉదయ్ రెడ్డి నేతృత్వంలో ఈ కేసును ఛేదించారు. అతి తక్కువ సమయంలో కేసును ఛేదించి, నిందితుడిని అరెస్ట్ చేయడంతో పాటు చోరీ సొత్తును రికవరీ చేసిన సిబ్బందిని ఉన్నతాధికారులు అభినందించారు.

# కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు బీఫాం అందజేసిన

- ఎమ్మెల్యే వేముల వీరేశం
- కనకదుర్గ ఆలయంలో ప్రత్యేక పూజలు

**చిట్యాల క్రైమ్ మిర్రర్:** చిట్యాల మున్సిపాలిటీ ఎన్నికల సందర్భంగా మంగళవారం నాడు చిట్యాల పట్టణంలోని శ్రీ కనకదుర్గ అమ్మవారి ఆలయంలో అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం . ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేయనున్న అభ్యర్థులకు భీం ఫారంలను అందజేస్తూ, రానున్న ఎన్నికల్లో ఘన విజయం సాధించాలని ఆకాంక్షించారు. కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని పేర్కొంటూ కార్యకర్తల్లో ఉత్సాహాన్ని నింపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఫోరం అధ్యక్షులు కాటం వెంకటేశం, గుడిపాటి లక్ష్మీనరసింహ, ఏనుగు రఘుమారెడ్డి,మారగోని అంజనేయులు, జడల చిన్న మల్లయ్య,పాటి దివాకర్ రెడ్డి,ఎరుపుల



పరమేష్, ఎస్కే ఇబ్రహీం, బెల్లీ సత్తయ్య, పాటి మాధవరెడ్డి, బొబ్బల రాంరెడ్డి, గుండెబోయిన సైదులు, దేశపాక రాజేష్, ఎద్దుల పురి కృష్ణ, కొసనం అశోక్, చిలువేరు శేఖర్, కోనేటి కృష్ణ, సల్ల రాజు, కళ్లెం నరసింహ, శ్రీకాంత్ చారి, మెట్టు మనోహర్ తదితరులు పాల్గొన్నారు

# కాంగ్రెస్ పార్టీకి సంపూర్ణ మద్దతు ప్రకటించిన సీపీఐ పార్టీ

- కాంగ్రెస్ వైపు ప్రజల ప్రవాహం

**చిట్యాల క్రైమ్ మిర్రర్:** చిట్యాల మున్సిపాలిటీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయాన్ని ఎవరూ ఆపలేరని మరోసారి స్పష్టమైంది. కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న ప్రజాహిత పాలన, అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలకు మద్దతుగా సీపీఐ పార్టీ కాంగ్రెస్ పార్టీకి సంపూర్ణ మద్దతు ప్రకటించింది. సీపీఐ పార్టీ తరఫున 02వ వార్డు ఎస్కే ఖాతీజ, 07వ వార్డు బొలుగురి సుగుణమ్మ లింగయ్య నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం మర్యాదపూర్వకంగా కలిసి కాంగ్రెస్ పార్టీకి తమ పూర్తి సహకారాన్ని తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రజల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ పార్టీ అమలు చేస్తున్న పథకాలు అన్ని వర్గాల ప్రజలకు నేరుగా లబ్ధి చేకూరుస్తున్నాయని తెలిపారు. ప్రజల నమ్మకం, ప్రజల ఆశలు అన్నీ కాంగ్రెస్ పార్టీ వైపే ఉన్నాయని స్పష్టం చేశారు. చిట్యాల మున్సిపాలిటీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘనవిజయం ఖాయమని, కాంగ్రెస్ జెండా ఎగరడం తథ్యమని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పోకల దేవదాసు, పాటి మాధవరెడ్డి, జడల చిన్న మల్లయ్య, సిపిఎం నాయకులు అక్బర్, బాలరాజు, దేవేందర్, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు



# జనం 24 టీవీ క్యాలెండర్ ఆవిష్కరించిన మంత్రి అడ్లూరి



**క్రైమ్ మిర్రర్ పెగడ పెల్లి :** జగిత్యాల జిల్లాలోని ధర్మపురి నియోజవర్గంలోని క్యాంప్ ఆఫీసులో తెలంగాణ రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ చేతుల మీదుగా జనం 24 టీవీ క్యాలెండర్ ఆవిష్కరించడం జరిగింది. ఈ ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ జనం 24 టీవీ ఛానల్ ఎం.డి బండారి బీరయ్య పతి సంవత్సరం క్యాలెండర్ ఆవిష్కరించి అందరికీ ఛానల్ అందుబాటులోఉంటూ ప్రజల సమస్యలపై గలమెత్తి ప్రజల పక్షం మాట్లాడుతూ ప్రజలకు మేలు జరిగేలా కార్యక్రమాలు చేస్తూ ఎన్నో సంవత్సరాలుగా ప్రజల కోసం పనిచేస్తున్నారని మంత్రి అడ్డూరి లక్ష్మణ్ కుమార్ కొనియాడారు. ఈ కార్యక్రమంలో మిట్టపల్లి రాజేందర్ రెడ్డి, శిరీష, మధుకర్, మహేష్, తదితరులు పాల్గొన్నారు.



# శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు

- మున్సిపల్ ఎలక్షన్ దృష్టా 30 పోలీస్ యాక్ట్ అమలు
- సభలు, సమావేశాలు, ర్యాలీలకు ముందస్తు అనుమతి తప్పనిసరి
- నేరేడుచర్ల మండల ఎస్ఐ రవీందర్

**క్రైమ్ మిర్రర్,నేరేడుచర్ల:** మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో, ఎన్నికల సమయంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని నేరేడుచర్ల మండల ఎస్ఐ రవీందర్ హెచ్చరించారు. మున్సిపల్ ఎలక్షన్స్ ఈనెల 11న జరగనున్న నేపథ్యంలో ఎలక్షన్ కోడ్ అమలులో ఉన్నదనీ ,30 పోలీస్ యాక్ట్ కూడా అమలులో ఉన్నందున పోటీ చేసే అభ్యర్థులు సభలు సమావేశాలకు నిర్వహించుకోవడానికి తప్పనిసరిగా పర్మిషన్ తీసుకోవాలనీ ,ప్రజలు రోడ్లపై గుమ్మిగుడి ఉండరాదని అన్నారు .శాంతిభద్రత లకు విగాథం కలిగించరాదని విస్మరిస్తే చట్టరీత్య చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు. అభ్యర్థులు వెహికల్ పర్మిషన్ కొరకు మున్సిపల్ కమిషనర్ కి , మైక్ , సభలు సమావేశాలకు ఆర్డీవో ,డిఎస్పీ ద్వారా పర్మిషన్ పొందగలరని తెలియజేశారు.

# అంతిమ యాత్ర



మంచితనాన్ని మంటకలిపి పైకం వెనకాల పరుగెత్తి
పరుగెత్తి అలసిపోయి కట్టెల పాన్పుపై ఆదమరిచి
కనురెప్పలు అర్పి నిదప్రోతున్న ఓ మనిషి
నీ వెంట ఏమి రాదు అని గ్రహించిలేక పోయినావు
చివరి అంతిమ యాత్రలో మోయడానికి
నేను అంటే నేను అని పోటీపడాలి అలా బత్రకాలి...
నీ బంధుగణంకోసం, నీ రక్తసంబంధం కోసం
నీ వాళ్ళ కోసం కుళ్ళు కుతంత్రాలు చేసి
కూడబెట్టిన నీ పైకంపై డేగలా వాలారే తప్ప
ఒక్కరు కూడా నీ దరిదాపుల్లోకి రాలేదు
చివరి అంతిమ యాత్రలో మోయడానికి
నేను అంటే నేను అని పోటీపడాలి అలా బత్రకాలి..
బందుజనం స్మశానం వరకు....
తలపై రూపాయి నాణెం ఒంటిపై తెల్లని వస్త్రం
నోట్లో గుప్పెడు బియ్యం నీతో కలిసి బూడిద
అయితాయే తప్ప నీతో కలిసిరావు
ఒక్క నీ మంచితనం తప్ప అదితెలుసుకో లేక
పోయావా ఓ మనిషి..!
చివరి అంతిమ యాత్రలో మోయడానికి
నేను అంటే నేను అని పోటీపడాలి అలా బత్రకాలి...
సంపాదించు కోవాల్సింది కేవలం ఆస్తిఅంతస్తులు
మాతమే కాదు నలుగురు మిత్రులని కూడా
అని మరచి పోయావా ఓ మనిషి..!
చివరి అంతిమ యాత్రలో మోయడానికి
నేను అంటే నేను అని పోటీపడాలి అలా బత్రకాలి...
నీకు చేతనైతే నలుగురికి సాయంచేయి, కానీ
కీడు మాత్రం చేయకు అని కోరుకుంటూ... రచన:
మంజుల పత్తిపాటి